

గదిలో వెలుతురు పలచగా ఉంది. ఫోమ్ బెడ్‌మీద పడుకుని పాశ్చాత్య సంగీతం తన్మయత్వంతో వింటున్నది మోనా. టేబిల్‌మీద ఉన్న రాధా కృష్ణుల సిరిరంగు గాజా విగ్రహంమీద వెలుగు కిరణాలు పడి చెదిరిపోతున్నాయి. అర్ధ నిమీలిత నేత్రాలతో విగ్రహాన్ని తదేకంగా చూస్తున్న మోనా అడుగుల చప్పుడుకి తల తిప్పి చూసింది. అపుడే స్నానంచేసి టవల్‌తో వస్తున్న అతను నవ్వుతూ ఆమెవైపు చూశాడు. రోమన్ శిల్పం మూర్తీభవించినట్లున్న [illegible] విగ్రహం మోనాకి ఆశ కలిగిస్తోంది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కాంక్ష చూసి, తెలియనట్లుగా డ్రెస్సింగ్ టేబిల్ వైపు కదిలాడు. డ్రెస్ చేసుకుని తల దువ్వుకుని వచ్చిన శ్యామ్ మోనావైపు చూసి, "వెళదామా?" అన్నాడు. తల అడ్డంగా ఊపి మరింత వెనక్కి జారగిలబడి దిండు గుండెలమీదికి లాక్కుని పడుకుంది. అది చూడగానే శ్యామ్ గుండె గతుక్కుమంది. ఇహ ఇప్పుడు ఈవిడని కదిలించటం

తెలిసింది. అందంలోనే కాదు, మెరిట్ లోను, స్పోర్ట్సులోను—అన్నిట్లో నాదే పైచేయి అన్నట్లుగా ఉండేది శ్యామ్ విషయం. ఇది చాలామంది ఈర్ష్యకి కారణం అని గ్రహించటానికి ఎక్కువ రోజులు పట్టలేదు సీతకి.

ఒక రోజు ఉదయం క్లాసుకి ఎగ్గొట్టి తిరిగ్గా మధ్యాహ్నం వచ్చారు శ్యామ్, అతని ఫ్రెండ్స్—విశ్వం, శర్మ. వాళ్ల మొహం చూస్తే నిద్రపోయి రెండు రోజు లయినట్లుగా ఉంది. ఎర్రబడిన కళ్లతో, రేగిన జుట్టుతో అపుడే క్లాసు లోకి అడుగు పెడుతున్న శ్యామ్‌ని చూసి చీదరించుకుంది, సీత పక్కనే ఉన్న జానకి.

“ఛ! సిగ్గులేని మొహాలు. కొంచెం కూడా డీసెన్సీ తెలీదు. క్లాసుకే వస్తున్నారో, లాడ్జింగ్‌కే వెళుతున్నారోకూడా అర్థం కావటం లేదు కాబోలు!” జానకి మండిపడుతూంటే అర్థంకాక తెల్లబోయి చూస్తున్నది సీత. అంతలోనే శర్మ అంటున్న మాటలు వినబడ్డాయి.

“బ్రదర్! అపుడే కొత్తమ్మాయికి పాఠాలు చెబుతూందిరోయ్ మా వదిన.”

“మనకి కాండక్ట్ సర్టిఫికేటు రాస్తున్నట్లుంది కాబోలు.” గోలగా నవ్వు కున్నారు మిత్రులు. ఆ సమయంలో జానకి తనకి వచ్చిన భాషతో వాళ్లని దీవిస్తూ సీతకి పరిచయం చేసింది క్లాస్‌మేట్సుని గురించి. మకుటం లేని మహారాజు ఎవరు అంటే, శ్యామ్ తకీమని లేచి నిల్చోగలడట! మింగటానికి లేక పోయినా మీసాలకు సంపంగినూనె కావా లనే రకమట! విశ్వం చాలా మంచి వాడు కానీ, ఈ శ్యామ్‌మూలంగా చెడి పోతున్నాడట! లక్షాధికారుల ముద్దుల బిడ్డడు కావటాన, ఎవరూ లేని శ్యామ్ బాగోగులు అన్నీ అతడే చూస్తాడట. “చక్కగా చదువుకొని, బుద్ధిగా ఉండ వలసిన వయస్సులో పోకిరీ లక్షణాలు ఎందుకు?” అంటుంది జానకి. ఆ పోకిరీ తనమేమిటో అడగాలని ఉంది సీతకి. కానీ, అడగలేకపోయింది. ధైర్యం చాల లేదు. కానీ, టేప్ రికార్డు ఆన్ చేసినట్లు జానకి వాగుతూనే ఉంది.

“వీళ్లు పెద్ద హీరో లయిపోయా రండీ ఈ కాలేజీకి!” విసుగ్గా మొహం చిట్లించింది.

“మరి హీరోయిన్ ఎవరు?” నవ్వుతూ అడిగింది సీత.

“ఇంతకు ముందు లేరు. ఇక మీరు వచ్చారుగా?” వచ్చటి కాంతు లీనుతున్న సీత చెంపలు చూసి, ఈర్ష్యదాచుకుంటూ అడిగింది జానకి. ఉలిక్కిపడింది సీత. ‘ఛ! ఇలా అంటుందేమిటి? త నేమన్నా అన కుంటుందేమోనన్న ఆలోచన కూడా లేదా ఈమెకు?’ మనసులో బాధపడింది. ఎవరికీ ఎదురు మాట్లాడలేని తన పిరికి తనానికి తనమీదే జాలిపడింది సీత. ఆ క్షణంలో జానకి మాటలకి ఎంత విలువ ఇవ్వాలో తెలిసిపోయింది. కానీ, ఇక్కడ విచిత్రమేమిటంటే ప్రతి రోజు జానకి శ్యామ్ కారెక్టరుని గురించి, అతని స్థితిగతుల గురించి జోరీగలాగ రొద చేసినా ఫలితం దక్కలేదు. రోజు అతనిని గురించి విని విని సీతకి తనకు తెలియకుండానే ఆకర్షణ కలగడం మొద లయింది. ఎప్పుడయినా ‘శ్యామ్‌కి శీలం గట్రా వాటిమీద నమ్మకం లేదు’ అంటూ జానకి మొదలుపెడితే వినుకోవ డం ప్రారంభించింది సీత.

“బోడి బి. ఎస్‌సి. చదువుకే పెద్ద మొగాళ్లయి పోతారేమిటి మరీను? నిండా ఇరవై ఉంటాయేమో మహా ఉంటే! ఈ వయసులో మనస్సనేదానికి ఈక్విలిబ్రియమ్ ఉండదు మగాళ్లకి. మనం దాన్ని గురించి మాట్లాడకూడదు” అంటూ సైడ్ చేయబోయేది.

“ఆటువంటి ఆకర్షణలు, వికారాలు అతి సహజం” అంటుంది జానకి, అక్కడికి తను సైకో ఆనాలిసిస్ తెలిసిన దానిలాగ! కానీ నమ్మలేదు సీత. ఎంత సహజమయిన వికారాలయినా, పవిత్రమయిన భావనలో అణగారిపోవలసిందే! పటిష్ఠమయిన హృదయగతానుబంధం అనేది ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య ఉంటే వయసు చేసే వెర్రిమొర్రి పనులకు తల వంచరు. ఇది సీత తన మనస్సులో అనుకున్నది. జానకి అతని గురించి అంత నిరసనగా మాట్లాడటం భరించలేకుండా ఉంది. తన ఆంతర్యపు అట్టడుగున శ్యామ్ మీద అనురాగం ఏర్పడుతూందనే నగ్న సత్యాన్ని గ్రహించేసరికి కంగారు పుట్టింది సీతకి. కానీ, ఆ విషయం తన ముఖంలో వ్యక్తం కాకుండా జాగ్రత్త పడింది. ప్రపంచం దృష్ట్యా ఆలోచిస్తే మనస్సుని బాహాటంగా ఇతరులముందు వెళ్ల బోయటం అంత తెలివితక్కువ పని మరొకటి లేదు. ఎందుకంటే మనిషి బుద్ధి బహు విచిత్రమయినది. ఒకే రకమయిన ఆంతర్యం ఎల్లవేళలా ఉంచుకో లేడు. అలా ఉంచుకోగలిగేవాడు దైవత్వా నికి దగ్గిరగా ఉన్నా డన్న మాట. మరి, అలాటి దేవుళ్లు ఎంతమంది ఉన్నారు ప్రజలలో! శ్యామ్‌పట్ల అర్థంకాని ఆకర్ష ణలో పడిపోతున్నందుకు తనను తనే కాసేపు తిట్టుకుంది. మనసులో ఊహలు మనసులోనే అందంగా సమాధి చేయటం అలవాటయిపోయింది సీతకి.

ఒక రోజు కాలేజీలో మ్యూజిక్ కాంపిటీషన్ జరగబోతున్నట్లుగా తెలి సింది. అందులో పాల్గొనదలుచుకున్న వాళ్లు క్లాసు రిప్రజెంటేటివ్‌కి పేర్లు ఇవ్వాలని నోటీసు వచ్చింది. ఆదేమిటో క్లాసులోని అబ్బాయిలంతా తన వైపు చూసేసరికి బిక్కచచ్చిపోయింది సీత. ‘పాటలా! ఇంకా నయం! తన కలాటి టాలెంట్స్ లేవే ఖర్మ! ఏదో క్లాసుకి వచ్చి చెప్పింది వినడం, ఓపిక ఉన్న రోజు చదువుకోవడం, లేకపోతే నిద్రపోవడం—ఇవి సరిగ్గా ఏడిస్తే చాల్లే!’ అనుకొంది మనస్సులో.

కానీ, మరునాడు లైట్ మ్యూజిక్ పోటీకి స్టేజిమీదికి వెళుతున్న శ్యామ్‌ని చూసేసరికి గుండె గుబగుబ లాడింది. తెల్లగా, పొడుగ్గా, చక్కని జుట్టుతో ఉన్న శ్యామ్ విగ్రహంకంటె అతి మధురంగా ఉంది అతని కంఠం.

‘ఇతనికి పాటలుకూడా వచ్చా?’ ఆశ్చర్య పోయింది సీత.

‘మరే! అన్నిటిలోనూ ఉండాలి మనం!’ కసిగా పెదవి కొరికింది జానకి.


ఏవో లలితగీతాలమధ్య “మామిడి చెట్టును అల్లుకున్న దొక మాధవీలతా” అంటూ మైక్‌ముందు నిలుచున్న అతనిని మైమరిచి చూస్తున్నారు గర్ల్సు అంతా! అంతర్గతంగా అతనిని చాలామంది ఆరాధిస్తున్నారన్న సంగతి సీతకి తెలిసి పోయింది. పరధ్యానంగా వింటున్న సీతకి ప్రోగ్రామ్ అయిపోవడం, శ్యామ్‌కి ఫస్ట్ ప్రైజ్ లైట్‌మ్యూజిక్‌లో వచ్చిందను కోవడం తెలీనేలేదు. అతనిని ఫ్రెండ్స్ అందరూ చుట్టుముట్టేశారు అభినందన లతో! విశ్వం, శర్మ ఆ ప్రైజ్ ఏదో తమకే వచ్చినంత సంబరంగా ఉన్నారు. ఈ హడివిడిలో అందరితోపాటు నస్తూ జానకికూడా అతనికి నవ్వుతూ తన అభినందనలు తెలపడం చూసి అదిరి పోయింది సీత. అతని పరోక్షంలో అతి నీచంగా విమర్శిస్తూ, అతని సమక్షంలో అంత హాయిగా దరహాస వదనంతో ఎలా మాట్లాడగలుగుతుంది? ఈ మాట వసంతతో అంటే నవ్వింది. “జానకి నాలిక పాము నాలిక. అంటే రెండు చీలిక లుంటా యన్న మాట. ఏది బడితే అది వాగుతుందిలే” అన్నది.

“దీనికి అసలు కారణం తెలుసా?” వసంత అడిగింది.

“ఏమిటి?”

“పోయిన సంవత్సరం జానకి విశ్వానికి ఏదో లవ్‌లెటరులాటిది వ్రాసిందిట. అది శ్యామ్‌కి చూపించాడు అతను. జానకిమీద మంచి అభిప్రాయం లేని శ్యామ్, ఆ విషయాని కంత ప్రాముఖ్యం ఇవ్వద్దని అన్నాడు. తరవాత తరవాత ఇది అందరికీ తెలిసిపోయింది. అందుకనే వాళ్లిద్దరూ ఒకరి నొకరు మింగేసేలా చూసుకుంటారు.” వసంత నవ్వుతూ అంది.

అపుడు థర్డ్ టరమ్ జరుగుతున్నది. ఫైనలియర్స్ అందరూ రికార్డులు, చదువు—ఈ గొడవలో పడిపోయారు. ఆ రోజు మామూలుగా క్లాసుకు వచ్చింది సీత. క్లాసుమేట్సందరూ తనవైపు అదో రకంగా చూస్తున్నారు. ఎందుకో అర్థం కాలేదు. తనవైపు పరీక్షగా చూసు కుంది. మామూలుగానే ఉంది. వాళ్ళ



జవనాశ్వాలు

చిత్రం – డి. సుబోధ్ (హైదరాబాద్–38)

చూసే చూపుల అర్థం ఏమిటో అవగాహన కాలేదు. సీటులో కూర్చుని యథాలాపంగా బోర్డువైపు చూసిన సీత గుండె ఆగిపోయింది. అక్కడ ఓ అందమైన అబ్బాయి కౌగిలిలో మరో అందమైన అమ్మాయి గువ్వలా ముడుచుకుపోయి ఉన్న దృశ్యం కనబడింది. అది చాలదన్నట్లు వాటికి పేర్లు కూడా తగిలించారు. ఒకటి తన పేరు. మరొకటి శ్యామ్‌ది. ఇంత ఘాతుకానికి ఎవరు తలపెట్టారో అనుకుంటూ రివ్వున ఇంటికి వచ్చి పడింది అక్కడ ఉండలేక. ఆ రోజంతా గదిలో పడుకుని గుండె లవిసిపోయేటట్లు ఏడ్చింది సీత. ఫైనలియర్ పరీక్షలు పట్టుమని రెండు నెలలుకూడా లేవు. మరో ఇరవై రోజుల్లో ప్రిపరేషన్ హాలిడేస్ ఇవ్వబోతున్నారు. ఇక కాలేజీ ముఖం చూడటం ఇష్టంలేక, పరీక్షలు రాయనని చెప్పేసింది ఇంట్లో. ఇపుడు రాస్తే క్లాసు రాదని, వచ్చే సెప్టెంబరులో మంచి మార్కులు తెచ్చుకోవచ్చని, అదిగాక ఇపుడు తన ఆరోగ్యం బావుండటం లేదని నోటికి వచ్చినట్లు బొంకి ఇంట్లోవాళ్లను నమ్మించగలిగింది. ఆ రోజు జరిగిన సంఘటనతో శ్యామ్‌మీద ఉన్న ప్రేమ, గౌరవం అన్నీ బూడిదయిపోయాయి. 'ఎంత పోకిరీరకాలు కాకపోతే ఇలా చేస్తారు?' అనుకుని బాధపడింది. ఆ సాయంత్రం వసంత ఒక్కతే వచ్చింది సీత దగ్గిరికి. ఈ విషయం ప్రిన్సిపాల్ దాకా పోయిందని, ఆ తరవాత శ్యామ్‌ని పిలిపించటం, దానికి అతను తను ఎంత మాత్రం బాధ్యుణ్ణికానని గట్టిగా చెప్పటం జరిగిందిట. అతనుకూడా ఆ రోజు క్లాసుకి రాకుండానే వెళ్లిపోవడం జరిగిందిట. ఈ సంగతులు చెప్పి, "నువ్వు శ్యామ్‌ని అనుమానిస్తున్నావు కదూ?" అని అడిగింది వసంత. ఎర్రగా, జ్యోతుల్లాగ అయిన కళ్లతో అవునన్నట్లు తల ఊపింది.

"అత నలాటివాడు కాదు, సీతా! ఇంతకు ముందెపుడూ అతను ఇలాటి విషయాలలో కల్పించుకోలేదు. ఇపు డెలా చేస్తాడు? అయినా, ఇలా పరీక్షలముందు మానేస్తాననడం ఏం బాగాలేదు."

దానికి ఏం మాట్లాడలేదు సీత. ఆ సమయంలో తను ఏం మాట్లాడినా సీత మనస్సు బాధపడుతుందని వెళ్లిపోయింది వసంత. తరవాత ఒక వారం రోజులకి శ్యామ్ సీత ఇంటి అడ్రస్ వెతుక్కుని వచ్చాడు. అతనిని ఇంట్లోకి ఆహ్వానించే ధైర్యం, చొరవ, మాట్లాడగలిగే శక్తి లేక ఇంట్లోనే ఉండికూడా లేదని కబురు చేసింది. కాని, మళ్లా నెల రోజులకి రిజిస్టరు పోస్టులో అతను వ్రాసిన ఉత్తరం వచ్చింది. వణికే చేతులతో అందుకుని చదివింది.

"మిస్ సీతా!

మీరు బాహ్యంగా ఎంత సుకుమారులో అంతర్యంలో అంత కఠినులు అని అర్థం అవుతూంది. కనీసం మాట్లాడటానికి ఒక అయిదు నిమిషాలు టైము కూడా ఇవ్వలేకపోయారు. నా తప్పు లేకపోయినా, మీ కోసం తప్పు చేసినవాడిలాగ నిలబడవలసి వచ్చింది. ఆ నాటి విషయంలో నా ప్రమేయం ఎంత మాత్రం లేదని హృదయపూర్వకంగా చెబుతున్నాను. మీరు నమ్మగలిగితే నాకు కొంత రిలీఫ్! మీరు పరీక్షలు వ్రాయడం లేదని తెలిసింది. అందుకు వే నెంతవరకు కారణమో నాకు తెలీటంలేదు. కానీ, ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మీ మీద గౌరవాభిమానాలు కలవాడిని. మీ సాన్నిహిత్యాన్ని కోరేవాడనేకాని మిమ్మల్ని పది మందిలో అవమానించగలిగే శక్తి నాలో లేదనే నిజాన్ని ఒప్పుకుంటున్నాను.

—శ్యామ్."

ఆ ఉత్తరం చూసి నిశ్శబ్దంగా ఏడ్చింది సీత. ఆ మౌనంలోనే రోజులు గడిచిపోయాయి. శ్యామ్‌కి డిస్టింక్షన్ వచ్చిందని తెలిసింది వసంత లెటరు మూలంగా! తరవాత సెప్టెంబరుకి ఎంత బాగా చదివినా సీతకి సెకండ్ క్లాసు మాత్రమే వచ్చింది. ఆగ్రాలో బోటనీ ఎమ్. ఎస్‌సి. కి సీటు వస్తే వెళ్లిపోయింది. ఒంటరిగా ఒక్కతే పడుకుని ఆలోచిస్తున్నప్పుడు శ్యామ్‌కి లెటరు వ్రాయాలనిపించేది. కానీ, ఏం రాయాలి? ఎక్కడికి వ్రాయాలి? సవాలక్ష సందేహాలతో కొట్టుమిట్టాడేది మనసు. వసంతకి వ్రాస్తే, తను కనుక్కొని అడ్రసు ఇవ్వగలదు. అయినా, ఇలా అర్ధాంతరంగా వ్రాసిపడేస్తే వాళ్ల దృష్టిలో తన విలవ ఎంత దిగజారిపోతుందోనని అభిమానపడి ఆ ప్రయత్నం విరమించుకుంది.

చాలా రోజుల తరవాత సీతకి ఏలూరు వెళ్లే బస్సులో శర్మ కనిపించాడు. అతనే ముందు గుర్తుపట్టి, వచ్చి ఎదర సీట్లో కూర్చుని మాటలు ప్రారంభించాడు. ఆ మాటా ఈ మాటా చెపుతూ, తను బందరులో బోటనీ లెక్చరర్‌గా ఉంటున్నట్లు చెప్పాడు. విశ్వం పెళ్లి చేసుకున్నాడని, బిజినెస్ చేస్తున్నాడని తెలిసింది అతని మాటల్లో! 'అందరి సంగతి చెబుతున్నాడు. శ్యామ్ సంగతి చెప్పడేం?' మనసులో అనుకుంది. 'కానీ ఇప్పుడు అతని మాట వస్తే ఎలా మాట్లాడాలి?' అనుకుంటున్నది సీత. గుండెల్లో కంపన బయలుదేరింది అప్పటికే! ఇంతలో అడగనే అడిగేశాడు: "శ్యామ్ సంగతి మీకు తెలుసా?"

ఉలిక్కిపడింది సీత. చేతిలో పుస్తకం జారి కింద పడింది. "అబ్బే! నా కేం తెలుసు!" స్వరంలో మార్పు తెలియనీయలేదు.


"అతను బెంగుళూరులో ఎమ్. ఎస్‌సి. చేశాడు బయోకెమిస్ట్రీతో. అది అయిన వెంటనే రిసెర్చికి ఫారిన్ స్కాలర్‌షిప్ వస్తే అమెరికా వెళ్లిపోయాడు."

"వెళ్లిపోయాడా!" ఆత్రంగా అనేసి నాలిక కరుచుకుంది వెంటనే. శర్మ విచిత్రంగా చూశాడామెవైపు. అతన్ని గురించి ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకోవాలనుకున్న సీత, శర్మ ఏదో బస్‌స్టాప్‌లో గుడ్‌బై చెప్పి బస్సు దిగి వెళ్లడం చూసి నీరుకారిపోయింది. ఏదో శాశ్వతంగా దూరమయినట్లనిపించింది. మనసులో అనుకున్నది అడగటానికిగాని, ఆచరణలో పెట్టటానికిగాని ఎందు కింత తాత్సారం చేస్తుంది తను?

"అవకాశాలు భగవంతుడు అందరికీ ఇస్తాడు. కానీ, అవి గుర్తించి అందుకోవడం అందరికీ చేతకాదు!" అన్న టాగూర్ వాక్యం తనలాటి వాళ్లని చూసే రాసింది అనుకున్నది. తన అశక్తతకు కళ్లవెంట గిర్రున నీళ్లు తిరిగాయి.

* * *

ఆ రోజు ఆదివారం. ఆకాశం అంతా మబ్బులు కమ్మి, చల్లగా వీస్తున్నది గాలి. ఆదివారం కావటాన ఉమెన్స్‌కాలేజీ హాస్టల్‌కి వచ్చేపోయే విజిటర్సుతోటి, చల్లగాలి పీల్చుకోవటానికి బయటికి వచ్చి చెట్ల క్రింద పచ్చికలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్న అమ్మాయిలతోటి చాలా సందడిగా ఉన్నది. ఆవరణ అంతా చెట్ల నీడలో మరింత చల్లగా ఉంది. అక్కడక్కడ వేసిఉన్న సిమెంట్ బెంచీలమీద విజిటర్సు కూర్చొని ఉన్నారు. మధ్యగా ఉన్న ఫౌంటెన్‌లోనుండి నీళ్లు జల్లుగా పడుతున్నాయి. చెట్లనీడలో చతికిలబడి ఎవరికి ఏ విజిటరు వచ్చారో, వాళ్ళు ఏ రకంగా బంధువులో ఆలోచిస్తున్నారు కొంతమంది అమ్మాయిలు. పేరుకి మాత్రం చేతిలో పుస్తకాలు కానీ, బుర్రలో పరాయివాళ్లను గురించిన ఆలోచనలు! వాతావరణం ఇంత హాయి గొలిపే సమయంలో, హాస్టలు మెయిన్‌గేటునుండి ఒక కారు దూసుకొని వచ్చింది. అందులోనుండి తెల్లటి బట్టల్లో ఉన్న ఒక వ్యక్తి దిగాడు. ఫౌంటెన్‌కి దగ్గిరగా వేసిఉన్న చిన్న టేబిలుముందున్న కుర్చీలలో కెమిస్ట్రీ లెక్చరరు ఇంద్రాణి, హోమ్ సైన్స్ లెక్చరరు రాజేశ్వరి కూర్చొని ఉన్నారు. వాళ్లిద్దరూ హాస్టలుట్యూటర్స్. అతను వాళ్ల దగ్గిరికి వచ్చి తన జేబులోనించి చిన్న కాగితం ఇచ్చి, ఆ పేరుగల వ్యక్తి కావాలని అడిగాడు. అందులో ఇంద్రాణి అనే ఆమె ఇతనిని తన వెంట బెట్టుకుని తమ కొలీగ్ రూమ్‌వైపు తీసుకువెళ్లింది. అతన్ని అక్కడే మెట్ల మీద వదిలేసి ఆవిడ రూమ్ లోపలికి వెళ్లిపోయింది. మల్లి, కనకాంబరం, జినియా, నందివర్ధనం, మందార, గులాబీలతో విరగబూచింది తోటంతా. మెట్ల మీద నిలబడి తన పక్కనే ఉన్న స్తంభానికి దట్టంగా అల్లుకొని పైకి రెండో



వెయ్యి స్తంభాల మంటపం (వరంగల్)

ఫోటో—సంపత్ (హైదరాబాద్)

అంతస్తుమీదికి ఎగబాకిన మాధవీలతను తదేకంగా చూస్తున్నాడు అతను. గాలికి అది తల లూపుతూ, సువాసనలు వెదజల్లుతూంటే తనకి అత్యంత ఇష్టమైన పాట గుర్తుకు రాసాగింది.

"రండి" అన్న పిలుపుతో వెనక్కి తిరిగాడు.

"ఆవిడ ఇప్పుడే వస్తారు. మీరు కూర్చోండి" అంటూ కుర్చీ చూపించి బయటకు వెళ్లిపోయింది ఇంద్రాణి. పక్కనే ఉన్న బాత్‌రూమ్ తలుపు తీసుకుని గదిలోకి అడుగు పెట్టింది సీత. అక్కడ కుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్న వ్యక్తిని చూడగానే ఒక క్షణం కళ్లు తిరిగినట్లయింది ఆమెకు. తన ఊహల్లో, కలల్లో ఛాయలాగ వెన్నంటిన వ్యక్తి నాలుగు సంవత్సరాల తరవాత సజీవంగా తన కళ్లముందు కనబడేసరికి ఆ సంఘటనకు తట్టుకోలేక పోయింది సీత.

"సీతా!" అన్న పిలుపుతో ఉలిక్కిపడింది. ఎప్పుడు వచ్చి మంచంమీద కూర్చుందో తనకే తెలీదు.

"కొంచెంకూడా మార్పు రాలేదు మీలో. ఇంత వయస్సు వచ్చినా వెనకటి సంకోచము, బెదురు పోలేదేమిటి?" పేపరు మడిచి పక్కన పెడుతూ అన్నాడు.

ఎవరినయితే అనుక్షణం చూడాలని ఆరాటపడిందో ఆ వ్యక్తి ఎదట నిలబడి 'సీతా' అని పిలుస్తూంటే ఏం మాట్లాడాలో అర్థం కావటం లేదు. ఎప్పటి పిరికితనం అడ్డు వస్తున్నది. అసలు తను ఊహించని అనుభవం ఇది.

"బాగా చిక్కిపోయారు. అప్పటికీ, ఇప్పటికీ వచ్చినమార్పు అదే!" ఆత్మీయత ధ్వనించిందా కంఠంలో.

చురుగ్గా తల ఎత్తింది. ఆ విసురులో కోపం, నిర్లక్ష్యం కనిపించాయి శ్యామ్ కళ్లకు. అతని కళ్లు తననే పరీక్షగా చూడటం గమనించి చూపులు తిప్పుకుంది. అంతరాంతరాలలో తాను తన మంచి అందరినుంచి భద్రంగా దాచుకున్న నిజాన్ని బయటికి లాగాలనే పట్టుదల కన్పిస్తున్నదా కళ్లలో. కనిపించీ కనిపించని ఆ గది కాంతిలో సీత ముఖంలో భావాలు చదువుతున్నాడు అతను. మునిపంటితో కిందిపెదవి నొక్కిపట్టి ఉద్వేగాన్ని అణచుకుంటున్నది సీత. మనసులో ఉవ్వెత్తున కెరటాల్లా లేచి పడుతున్న భావసంచలనం మొహంలో ప్రస్ఫుటం కాకుండా ఉండటానికి యమయాతన పడుతున్నది.

సిగరెట్ పొగ వలయాలలో శ్యామ్ ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. ఇండియాకి రావడం రావడం తను విశ్వందగ్గిరికివెళ్లాడు. ఎప్పటి ఆత్మీయత, ఆదరణకు లోటులేదు అతడిలో! సీతను గురించి తెలుసుకున్నావా అంటే మౌనంగా ఉండిపోయాడు. చివరికి ఎంత ప్రయత్నించినా ఆమె ఎక్కడ ఉందో తెలుసుకోలేకపోయాను అన్నాడు. సన్నగిల్లిపోతున ఆశను, ఉత్సాహాన్ని ఎగదోసి శర్మ దగ్గిరికి వెళ్లాడు. తన రాకకు అమితంగా ఆనందించిన శర్మ తను అడగకముందే సీతను గురించి చెప్పాడు. "శ్యామ్! సీత ఇప్పుడు ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నది. అక్కడ హాస్టలు ట్యూటర్‌గా నియమించారనిచెప్పింది. నేను నీ విషయం చెప్పేసరికి ఎందుకో తడబడింది. మాటలమధ్య తన దగ్గిర ఉన్న పుస్తకం తీసుకొని తిరగేస్తూంటే అందులో ఒక ఫోటో చూశాను. అది మన కాలేజీ మాగజైనునుండి కత్తిరించి తీసినది. ఆమెకు తెలియకుండా తీసుకువచ్చేశాను. అది ఇదే! దాని వెనక 'సీత—శ్యామ్' అని వ్రాసి ఉంది. శ్యామ్! ఆవిడ నిన్ను ఇంకా మరిచిపోలేకపోతున్నది. అయినా ఇది నా అనుమానం మాత్రమే!" అన్నాడు.

కానీ ఇపుడిక్కడ ఈమె ప్రవర్తన తన ఆశల్ని కూలదోస్తున్నట్లుగా ఉంది. చివరి కొక నిశ్చయానికి వచ్చినట్లుగా అన్నాడు; "మిస్ సీతా! నేను చాలా పొరపాటు చేశాను. మీ పర్మిషను తీసుకోకుండా ఇక్కడికి రావడం నాకే సిగ్గుగా ఉందిప్పుడు. అంతా మనస్పొగక ఒక నిజాన్ని స్వయంగా తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో వచ్చాను. ఇలా రావడం మీకు బాధ కలిగించినట్లయితే క్షమించండి." తల వంచుకుని నెమ్మదిగా చెబుతున్న అతను "శ్యామ్" అన్న పిలుపు గట్టిగా వినిపించడంతో అదిరిపడి తల ఎత్తాడు.

"నీ కసలు హృదయం లేదు. ఇన్ని రోజులుగా నా అశక్తతకు బాధపడింది చాలక, ఇపుడు నువ్వుకూడా నన్ను మాటలతో అవమానించా లనుకుంటున్నావా? నేను నీకేం ద్రోహం చేశానని నా కిలాటి శిక్ష విధిస్తున్నావు?" ఇన్ని సంవత్సరాలుగా పైకి గంభీరపు పూత పూసిన సీత బేలతనం ఒక్కసారి బయట పడింది. చెంపలమీద ధారగా కారిపోతున్నాయి కన్నీళ్లు. ఎన్నో రోజులుగా మూసిపెట్టిన ఆవేదన కన్నీళ్లరూపంలో బహిర్గతమవుతున్నది సీతకు. మెరుపులాటి ఒక సున్నితమయిన భావన అతన్ని ఒక్కసారిగా తెలియని ఔన్నత్యాలకి తీసుకుపోయింది. శిఖరాల అంచున కూర్చుని చల్లని వేణుగానం వింటున్న అనుభూతి కలిగింది.

"సీతా!" అప్రయత్నంగా పలికిందతని కంఠం. ఆ స్వరంలో చిందిన అనురాగపు జల్లులో తడిసిపోయింది సీత అంతరంగం.

•     *     •


పోస్టులో వచ్చిన ఉత్తరాన్ని చదువుకుంటున్నాడు విశ్వం అపుడు. అది శ్యామ్ గుంటూరునుండి వ్రాశాడు. "ఒరేయ్, విశ్వం! అనుకున్న పని అక్షరాలా నెరవేరి దిగ్విజయం లభించిందిరా! సీత నా కోసం ఇన్ని రోజులనుండి నిరీక్షిస్తున్నది, తెలుసా! నేను చెప్పలేదూ, నా మనసు నన్నెపుడూ మోసం చేయదని. నా గుండెలు సంతోషంతో ఎగిరిపడుతున్న ఈ సమయంలో నీవు గుర్తుకు వచ్చావు. నా అభివృద్ధికి అడుగడుగునా సహాయపడిన నీవు నా ఆనందంలో భాగం పంచుకుంటున్నావు కదూ! దైవంలాటి నీ అభినందనలు మొదటగా స్వీకరించటం కోసం మే మిరువురం ముందు నీ దగ్గికే వస్తున్నాం —నీ శ్యామ్."

అదోరకమైన ఉద్వేగంతో వణికాయి అతని పెదవులు.

ఆ రాత్రి విశ్వం తన డైరీలో ఇలా రాసుకున్నాడు:

"శ్యామ్! తన మనసులోని బలహీనతలను మనఃస్ఫూర్తిగా అంగీకరించేవాళ్లు అరుదు. అటువంటి మగాళ్లు ఉత్తములు కాకపోయినా మధ్యములే! నేను కనీసం మధ్యముడుగానయినా ఉండాలనుకుంటున్నాను. నన్ను దైవం అనుకుంటున్నందుకు చాలా బాధగా ఉందిరా, శ్యామ్! లోకంలో నమ్మరాని నెధవల్లో మొదటివాడిని నేను. విదేశాల్లో ఉండి నువ్వు సీతని గురించి వ్రాయమంటే, అన్నీ తెలిసి ఉండి నాకు తెలియదని నిన్ను నమ్మించిన ద్రోహిని. సీతను అంతర్యంలో అమితంగా ప్రేమిస్తూ, ఆ విషయాన్ని బయటికి చెప్పుకోలేని పరిస్థితుల్లో పుట్టిన అభాగ్యుణ్ణి. నీకు, సీతకు మధ్య ఉన్న దూరాన్ని మరింత ఎక్కువ చేయటం కోసం శ్రమపడిన నీచుణ్ణి నువ్వు దైవం అనుకుంటున్నావు కదూ! ఒక్క సీత విషయంలో తప్ప మిగతా అన్ని విషయాల్లో నీవు నాకు ఆప్తుడవు. తల్లి, తండ్రి, అంతస్తులు—ఇవేమీ లేవని బాధపడేవాడివి ఒకప్పుడు. నీవు ఏవయితే లేవని బాధపడ్డావో, అవన్నీ ఉండటం మూలంగా సీతకు దూరమయాను నేను.

సౌందర్యం, సామర్థ్యం, స్వేచ్ఛ—ఈ మూడూ ఉన్న అదృష్టవంతుడివి. నీలాటి వ్యక్తులు భవిష్యత్తు చూసుకుంటూ వెలుగులోకి పయనిస్తారే కాని, గతంలోని జ్ఞాపకాలతో కుళ్లిచావరు. అది ప్రగతికి నిదర్శనం. ఆత్మవంచన చేసుకునే పిరికివాళ్లని నిలువునా కాల్చేయాలంటావు నీవు! ఆలోచనలలో మగ్గిపోతూ, జీవచ్ఛవాల్లా బ్రతికే నాబోటి విశ్వాలని నువ్వు అసహ్యించుకుంటావని తెలుసు. అందుకే ఈ అద్భుతమయిన నటన. నా కళ్లు ఎపుడూ ఏడవలేదురా, శ్యామ్! కానీ, నా మనసు అనుక్షణం ఏడుస్తూనే ఉంది." ★



"రాలు పూచిన పూలు (కాకతీయ శిల్పకళ—వరంగల్)

ఫోటో—వి. జి. ఎస్. రెడ్డి (నెల్లూరు)